# సామ్రాజ్యవాదుల దురాక్రమణ ఆయుధం 'నాటో'

**2018** జులైలో బ్రస్సెల్స్‌లో ఎన్నో వైరుధ్యాలతో ప్రారంభమైన నాటో సదస్సు చివరకు ఏకగ్రీవంగా ఓ ఉమ్మడి ప్రకటన చేసింది. సదస్సుకు ముందునుంచీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ మిత్రదేశాలైన ముఖ్యంగా జర్మనీ, ఫ్రాన్స్‌లపై ముక్కు సూటిగా కొన్ని వ్యాఖ్యలు చేశాడు. ఆ దేశాలకు దశాబ్దాలుగా తాము రక్షణగా ఉన్నామని, ఇది ఎంతమాత్రం కొనసాగేదిలేదని, దీనికి ఎన్నో బిలియన్ల డాలర్లు తాము వెచ్చిస్తున్నామని కానీ ఆ దేశాలు మాత్రం రష్యాకు డాలర్లు చెల్లిస్తున్నాయని అన్నాడు. రష్యానుండి ఇంధన సరఫరా చేసుకుంటున్నందున జర్మనీ దాని చేతిలో పావుగా ఉందన్నాడు.నాటో స్టాక్‌ఎక్స్ఛేంజి కాదని, వ్యూహాత్మక లక్ష్యాలు, సాధారణ విలువలు కలిగిన దేశాల కూటమి నాటో అని వ్యాఖ్యానించాడు. జాతీయోత్పత్తిలో రక్షణకు 2 శాతం సరిపోదని, కూటమి దేశాలు 4 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందని సూచించాడు.

1949లో నాటో సైనిక కూటమిగా అవతరించింది. రెండో ప్రపంచయుద్ధానంతరం పెట్టుబడిదారీ దేశాలకు నాయకత్వం వహించే దేశంగా అమెరికా ముందుకొచ్చింది. సోవియట్ యూనియన్ నుంచి ఊహాజనిత దాడులను బూచిగా చూపించి యూరోపియన్ దేశాలను ఒకతాటిపైకి తెచ్చింది. యూరోపియన్ తదితర దేశాలపై పెత్తనం సాగించేందుకు ఇదొక సాకుగా చూపింది. నాటోలో ఏదేశంపై దాడి జరిగినా మిగతా దేశాలపై దాడిగా భావించటమన్నది లక్ష్యంగా వుంది. నాటో ఓ రక్షణాత్మక స్వభావం కలిగి ఉంటుందన్న అభిప్రాయం కలిగించింది. కాని నాటో సామ్రాజ్యవాదుల దాడికి ఉపకరిస్తుందన్నది ఏడు దశాబ్దాలుగా రుజువైన నిజం. నాటోదేశాల చట్టవిరుద్ధమైన జోక్యాలను, దాడులను చట్టబద్ధమైన చర్యలుగా చూపేందుకు ఐక్యరాజ్యసమితిని ఉపయోగిస్తున్నారు. ఇతర దేశాల్లో ప్రభుత్వాలను సాయుధ దళాల దాడులతో కూల్చివేసి దానికి మానవీయ దృక్పథం అనే ముసుగు తొడుగుతోంది అమెరికా. ప్రభుత్వాల అణచివేత నుంచి ప్రజల హక్కులను కాపాడుతున్నట్లు ప్రకటిస్తోంది. ఐక్యరాజ్యసమితి ఆంక్షలు పేరిట, లేదా టెర్రరిజంపై పోరు పేరిట నాటోదేశాలు క్రూరమైన దాడులు చేస్తున్నాయి. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, లిబియా, సిరియా దురాక్రమణల్లో సామ్రాజ్యవాద దేశాల ఆయుధంగా నాటో ఉపయోగపడింది. చిన్న, బలహీనమైన దేశాలను తమ దారిలోకి తెచ్చుకుందుకు నాటో ఉపయోగపడుతోంది. సోవియట్ రష్యా, దాని మిత్రదేశాలపై కూడబలుక్కుని నాటో దేశాలు పలురకాలుగా వత్తిడులు, దాడులు చేస్తున్నాయి. ఈవిధంగా 29 దేశాల కూటమిగా నాటో ప్రమాదకరంగా పరిణమించింది. సమానత్వం సూత్రం ప్రాతిపదికన ఏర్పడిన నాటోలోని ఆర్థిక, రక్షణ, రాజకీయ వ్యవహారాలపై పట్టు బిగించి అమెరికా పెత్తనం సాగిస్తున్నది. అమెరికా, ఇతర సామ్రాజ్యవాద దేశాల మధ్య పెరుగుతున్న వైరుధ్యాలే బ్రస్సెల్ సదస్సులో ట్రంప్ వ్యాఖ్యలకు మూలం. యూరోపియన్ దేశాల ఆర్థిక, వ్యాపార కార్యకలాపాలు తమ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపకూడదనేది అమెరికా ఆలోచన. ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడాలన్నదే అమెరికా ఎత్తుగడ. ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలు నిష్ఫలమయ్యే విధంగా తమ మిత్రదేశాలు వ్యవహరించకూడదని అమెరికా కోరుతోంది. ఇరాన్‌తో సంబంధాలు కొనసాగిద్దామనుకొన్న మిత్రదేశాలపై కూడా ఆంక్షలు విధిస్తామని అమెరికా ఆలోచించడం సామ్రాజ్యవాద దురహంకారమే.

బ్రస్సెల్స్ సదస్సులో ట్రంప్ వ్యాఖ్యలు జర్మనీ, ఇతర యూరోపియన్ దేశాలకు మింగుడు పడడం లేదు. దీనిపై జర్మన్ ఛాన్సలర్ మెర్కెల్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. తాము స్వయంగా నిర్ణయాలు, విధానాలు రూపొందించుకుంటామని ప్రకటించింది. యూరోపియన్ యూనియన్ అధ్యక్షుడు టస్క్ అయితే ఓ అడుగు ముందుకు వేసి 9/11 దాడుల అనంతరం అమెరికా పక్షాన నిలబడ్డామనేది గుర్తించాలన్నాడు. నాటో దేశాల్లో వైరుధ్యాలు, చీలికలు ఉన్నప్పటికీ యూరోపియన్ మిత్రదేశాలు నాటోలో అమెరికన్ ఆదిపత్యాన్ని సవాల్ చేయటానికి సిద్ధంగాలేవు. అయితే నాటో దేశాలన్నీ సాధకబాధలన్నీ పంచుకుంటామని అంగీకారానికి వచ్చాయి. సంకీర్ణం ప్రాథమిక లక్ష్యానికి కట్టుబడి ఉంటామని మిత్రదేశాలు ప్రకటించాయి. దీనివల్ల అర్థమయేదేంటంటే ప్రపంచ ప్రజలను దోచుకోవటంలో వారు ఒక్కటౌతారు. దానిలో ప్రధాన వాటాలకోసం మాత్రం పోటీపడతారు.

ooooo